తెలంగాణ

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం - 24- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 50 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




# తాగునీటి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి

- 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ
- రోజు విడిచి రోజు నీటి సరఫరాకు చర్యలు
- పనుల పురోగతిపై నెలనెలా నివేదికలు ఇవ్వాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):**

క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు విలీన మున్సిపాలిటీల్లో కూడా తాగునీటి సరఫరాలో ఏకరూపత ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో హైదరాబాద్ మహానగర తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ సంస్థ పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. రానున్న 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు.

మిగతా 2లో





# శ్రమ గౌరవమే సమాజ అభివృద్ధి

- చేతివృత్తుల ప్రాధాన్యంపై మంత్రి సందేశం
- వెదురుబుట్ట అల్లిన మంత్రి కొండా సురేఖ
- శ్రమను గౌరవించాలని పిలుపు

**యాదాద్రి, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆదిమ సమాజం నుంచి ఆధునిక నాగరికత వరకు మానవ పురోగతికి ప్రధాన చోదకశక్తి శ్రమేనని మంత్రి కొండా సురేఖ అన్నారు. యాదాద్రిలో నిర్వహించిన కార్యక్రమంలో వెదురుబుట్ట అల్లే ప్రక్రియలో పాల్గొన్న ఆమె చేతివృత్తుల గొప్పతనం, శ్రమ విలువపై తన అభిప్రాయాలను వెల్లడించారు. చేతులతో శ్రమ చేయడం ద్వారా మనిషి ప్రకృతిపై తన ఆధిపత్యాన్ని పెంచుకున్నాడని మంత్రి పేర్కొన్నారు. చేతులు, మెదడు పరస్పరం అనుసంధానమై కొత్త ఆవిష్కరణలకు, నాగరికత వికాసానికి బాటలు వేసాయని తెలిపారు.

మిగతా 2లో

## యువత సమస్యలపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఉత్తమ్

- బీజేపీపై మంత్రి తీవ్ర విమర్శలు
- రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రశంసించిన మంత్రి
- యువతకు కాంగ్రెస్ అండగా ఉంటుందని స్పష్టం



2లో

## సింగరేణి బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రైవేటు పోటీని ఎదుర్కొనేలా వ్యయ నియంత్రణ
- సత్తుపల్లి గనిలో భట్టి విక్రమార్క తనిఖీ
- దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికకు ఆదేశాలు

**ఖమ్మం, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):**

సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేసి భవిష్యత్ తరాలకు లాభదాయక ప్రభుత్వ రంగ సంస్థగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సత్తుపల్లి బహిరంగ బొగ్గు గనిని సందర్శించిన ఆయన బొగ్గు నిల్వలు,


మిగతా 2లో



## గ్లోబరీన అంశం సిఎం రేవంత్ రెడ్డికి

# కేటీఆర్ సవాల్ !

- విచారణకు సిద్ధమని స్పష్టీకరణ
- ముఖ్యమంత్రికి కేటీఆర్ లీగల్ నోటీసు
- గ్లోబరీనా ఆరోపణలపై 48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్
- విచారణకు సిద్ధమని స్పష్టీకరణ
- వరంగల్ లో మీడియాతో కేటీఆర్ చిట్ చాట్



**వరంగల్, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. వరంగల్‌లో గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో

మిగతా 2లో

## డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య



- సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణం
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఘటనపై సమగ్ర దర్యాప్తు ప్రారంభం

**హైదరాబాద్, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్‌లోని తెలంగాణ డీజీపీ కార్యాలయంలో గురువారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న

మిగతా 2లో




తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# తాగునీటి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న అన్ని తాగునీటి వనరులను పరస్పరం అనుసంధానం చేయడం ద్వారా ఒక వనరులో అంతరాయం ఏర్పడినా మరో వనరు ద్వారా నీటి సరఫరా కొనసాగించే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే తాగునీరు అందుతున్న పరిస్థితిని మార్చాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాలకు కనీసం రోజు విడిచి రోజు తాగునీరు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని అధికారులను ఆదేశించారు.



ప్రస్తుతం కొనసాగుతున్న తాగునీటి సరఫరా పనులను ఏడాదిన్నరలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎక్కడైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించి పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, శుద్ధి కేంద్రాల నిర్మాణ పనుల పురోగతిపై ప్రతి నెల తనకు నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో పరిశ్రమలు, వివిధ నిర్మాణ పనుల్లో శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించేలా అవసరమైన నిబంధనలు రూపొందించి అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సమావేశంలో మున్సిపల్ వ్యవహారాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, హైదరాబాద్ మహానగర తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# శ్రమ గౌరవమే సమాజ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

చేతులు కేవలం అవయవాలు మాత్రమే కాకుండా సృష్టికి, అభివృద్ధికి సాధనాలుగా నిలిచాయని చెప్పారు.
వెదురుబుట్ట అల్లేందుకు చేసిన ప్రయత్నం ద్వారా చేతివృత్తుల వెనుక ఉన్న నైపుణ్యం, ఓర్పు, కష్టాన్ని మరింత దగ్గరగా అనుభవించే అవకాశం లభించిందని మంత్రి అన్నారు. ఈ అనుభవం చేతివృత్తులపై తనకు ఉన్న గౌరవాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట నేడు వరుణయాగానికి మాత్రమే కాకుండా శ్రమయాగానికి కూడా ప్రతీకగా నిలిచిందని మంత్రి వ్యాఖ్యానించారు. శ్రమించే ప్రతి చేతిని గౌరవించడం సమాజ బాధ్యత అని, చేతివృత్తుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చేతివృత్తులు మన సంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతిబింబమని మంత్రి తెలిపారు. వాటిని ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ జీవనోపాధి బలోపేతం కావడంతో పాటు సంప్రదాయ కళలు కూడా తరతరాలకు నిలుస్తాయని చెప్పారు. శ్రమను గౌరవించే సమాజమే తన సంస్కృతిని చిరకాలం నిలబెట్టుకోగలదని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. శ్రమజీవుల కష్టాన్ని గుర్తించి వారికి తగిన గౌరవం, ప్రోత్సాహం అందించడం ద్వారానే సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఆమె అన్నారు.

# సింగరేణి బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

తవ్వకాల ప్రక్రియ, బొగ్గు నాణ్యతను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి తెలంగాణ ఆత్మ అని, రాష్ట్ర ప్రజలకు, కార్మికులకు ఈ 130 ఏళ్ల సంస్థతో విడదీయరాని అనుబంధం ఉందని పేర్కొన్నారు. ప్రైవేటు సంస్థల ప్రవేశం, విదేశీ బొగ్గు దిగుమతుల పెరుగుదలతో బొగ్గు రంగంలో పోటీ తీవ్రంగా మారిందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ పరిస్థితుల్లో సింగరేణి అత్యుత్తమ నాణ్యత గల బొగ్గును ఉత్పత్తి చేయడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. గనుల్లో పేలుళ్లు, లోడింగ్ సమయంలో మట్టి, రాళ్లు బొగ్గులో కలవకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.
నాసిరకం బొగ్గు సరఫరా వల్ల రవాణా వ్యయం పెరగడంతో పాటు ఉష్ణ విద్యుత్ కేంద్రాల పనితీరు దెబ్బతింటుందని, విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు, ఇతర వినియోగదారులకు నాణ్యమైన బొగ్గునే సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ప్రతి లోడింగ్ కేంద్రంలో కంపెనీ అధికారులు కచ్చితమైన పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. గత పదేళ్లలో కొత్త బొగ్గు గనుల వేలాల్లో పాల్గొనకపోవడం వల్ల సింగరేణి పలు అవకాశాలను కోల్పోయిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒక బొగ్గు గనిని సొంతం చేసుకున్న తర్వాత భూసేకరణ, అటవీ అనుమతులు, తవ్వకాల ప్రారంభానికి ఏడు నుంచి ఎనిమిది సంవత్సరాలు పడుతుందని, అందువల్ల కనీసం పదేళ్ల దూరదృష్టితో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు సంయుక్తంగా దీర్ఘకాల ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.



తాడిచెర్ల-2, నైనీ బొగ్గు గనులకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని భట్టి విక్రమార్క తెలిపారు. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా జరిగే బొగ్గు గనుల వేలాల్లో సింగరేణి పాల్గొనేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా స్వచ్ఛ ఇంధన వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సింగరేణి బొగ్గు ఉత్పత్తితో పాటు సౌర విద్యుత్ రంగంలోనూ విస్తరించాలని సూచించారు. సింగరేణికి ఉన్న గనుల అనుభవం, సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించి సెమీకండక్టర్లు, చిప్ తయారీకి అవసరమైన కీలక ఖనిజాలు, అరుదైన ఖనిజాల అన్వేషణలో కూడా అడుగులు వేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. సింగరేణిని ప్రపంచస్థాయి పోటీని తట్టుకునే లాభదాయక సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, విద్యుత్ ఉత్పత్తి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరీష్, సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పొత్రు, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., శాసనసభ్యులు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## గ్లోబరీన అంశం సీఎం రేవంత్ రెడ్డికి

# కేటీఆర్ సవాల్ !

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడిన ఆయన, గ్లోబరీనా టెక్నాలజీస్ అంశంలో తనపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొంటూ ముఖ్యమంత్రికి న్యాయపరమైన నోటీసు జారీ చేసినట్లు వెల్లడించారు. గ్లోబరీనా టెక్నాలజీస్ అంశంలో తనపై చేసిన నిరాధార ఆరోపణలకు సంబంధించి 48 గంటల్లో బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ముఖ్యమంత్రి మీడియా ద్వారా తనపై తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు.
గ్లోబరీనా సంస్థతో తనకు ఎలాంటి ఆర్థిక సంబంధాలు గానీ, యాజమాన్య హక్కులు గానీ లేవని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆ సంస్థ తన బినామీ కంపెనీ అని, సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. నిజంగానే ఆ సంస్థ తన బినామీ కంపెనీ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఒకవైపు ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, మరోవైపు దానిని తన బినామీ సంస్థగా ఆరోపించడం సమంజసం కాదన్నారు. అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న ముఖ్యమంత్రి బాధ్యతారహితంగా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కేటీఆర్ అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే తన ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. నిర్ణీత గడువులోగా క్షమాపణ చెప్పకపోతే సివిల్, క్రిమినల్ చర్యలతో పాటు పరువు నష్టం దావా కూడా వేస్తామని హెచ్చరించారు.
కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించరని కేటీఆర్ విమర్శించారు. రాజ్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకమని ఆరోపించారు. పగలు కాంగ్రెస్‌తో, రాత్రి బీజేపీతో ఉంటూ రెండు పార్టీల మధ్య రాజీ రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పాత కేసుల భయం, అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో రాజీ పడుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా భయపడుతున్నారని అన్నారు.
గ్లోబరీనా అంశంపై సీఐడీ విచారణకు తాను పూర్తిగా సిద్ధమని కేటీఆర్ స్పష్టం చేశారు. అదే విధంగా ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధించిన అవినీతి ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా సీఐడీతో విచారణకు ప్రభుత్వం సిద్ధమా అని ప్రశ్నించారు. అవసరమైతే అబద్ధ నిర్ధారణ పరీక్షకు కూడా తాను సిద్ధమేనని, ముఖ్యమంత్రి కూడా అందుకు ముందుకు రావాలని సవాల్ విసిరారు. తనపై చేసిన ఆరోపణలకు ప్రభుత్వం స్పష్టమైన ఆధారాలు సమర్పించాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ ఆరోపణలకు బదులుగా వాస్తవాలను వెల్లడించాలని ప్రభుత్వానికి సూచించారు.

# కేటీఆర్ జన్మదినం సందర్భంగా మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ



- పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'గిఫ్ట్ ఎ స్మైల్' కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్,పాల్గొన్న జిల్లా నాయకులు

హైదరాబాద్, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఏడాది కేటీఆర్ జన్మదినం సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు 'గిఫ్ట్ ఎ స్మైల్' పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగానే ఈ ఏడాది పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఉచిత కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్వయంగా మహిళలకు కుట్టుమిషన్లు అందజేసి వారికి స్వయం ఉపాధి దిశగా తోడ్పాటు అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా నాయకుల జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆదర్శనీయమని, 'గిఫ్ట్ ఎ స్మైల్' వంటి కార్యక్రమాలు పేదల జీవితాల్లో చిరునవ్వులు నింపడంతో పాటు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య,మాజీ మంత్రి సత్యవతి రాథోడ్,మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్,నన్నపనేని నరేందర్,ధర్మారెడ్డి,గండ్ర వెంకటరమణ రెడ్డి,మాలోతు కవిత తదితరులు పాల్గొన్నారు.




# డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

స్వామి అనే పోలీసు సిబ్బంది తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనతో పోలీసు శాఖలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల ప్రాథమిక వివరాల ప్రకారం, రాత్రి విధులు నిర్వహిస్తున్న స్వామి ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో కార్యాలయంలోని వాష్‌రూమ్‌లోకి వెళ్లారు. అక్కడ తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అనంతరం సహచర సిబ్బంది గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.
ఘటనాస్థలంలో కానిస్టేబుల్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో తన మరణానికి భార్య, పిల్లలకు ఎలాంటి సంబంధం లేదని, వారిని ఎవరూ ఇబ్బంది పెట్టవద్దని కోరినట్లు పోలీసులు తెలిపారు. తన కుటుంబాన్ని ఎల్లప్పుడూ కాపాడాలని భావిస్తున్నానని రాసిన ఆయన చివరి సందేశం అందరినీ కలచివేసింది. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వ్యక్తిగత, కుటుంబ, ఉద్యోగ సంబంధిత అంశాలతో పాటు ఇతర పరిస్థితులను కూడా పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సూసైడ్ నోట్‌లోని వివరాలను విశ్లేషిస్తూ పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోంది.
ఈ ఘటన నేపథ్యంలో పోలీసు సిబ్బందిపై విధి ఒత్తిళ్లు, మానసిక ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.



ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన మానసిక ఆరోగ్య సహాయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని ఆధారాలను సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, అనంతర చట్టపరమైన ప్రక్రియ చేపట్టారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## నీట్ పేపర్ లీకేజీపై నిరసన.. ఇల్లందకుంటలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



- రాహుల్ గాంధీ అరెస్టును ఖండించిన కాంగ్రెస్ నాయకులు

**ఇల్లందకుంట, జులై 23 (తెలంగాణ ముచ్చట్లు):** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ ఇల్లందకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నీట్ పేపర్ లీకేజీతో నష్టపోయిన విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో చోటుచేసుకుంటున్న అవకతవకలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పేపర్ లీకేజీ బాధిత విద్యార్థులకు న్యాయం చేయాల్సింది పోయి, వారికి అండగా నిలిచిన ప్రతిపక్ష నాయకుడిపై చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే పరీక్షల వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, పేపర్ లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వారి తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లెల తిరుపతి రెడ్డి, కనుమల్ల రామకృష్ణ, ఉప్పల శ్రీనివాస్ రెడ్డి, ఇంగ్లే రామారావు, పెద్ది శివకుమార్, కనుమల్ల సంపత్, అన్నం ప్రవీణ్, ఏలేటి రఘుపతి రెడ్డి, బక్కతట్ల రవీందర్, కల్లెం సత్యనారాయణ రెడ్డి, వంగ రామకృష్ణ, ఎక్కటి మధుసూదన రెడ్డి, గంధం రవీందర్, మీద రాజయ్య, మూడేళ్ల రమేష్, గురుకుంట్ల స్వామి, బండి మల్లయ్య, మూడెత్తుల మల్లేష్, మర్రి వీరారెడ్డి, ఆకుల రాము, జిల్లెల సందీప్ రెడ్డి, గూడెపు ఓదేలు, గోలి కిరణ్, పరమేష్, కారింగిల రాజేందర్, బొమ్మ శ్రీనివాస్, మట్ట అరవింద్, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, అకినేపల్లి వెంకటేష్, ఎడ్ల కిషన్ రెడ్డి, పశునుటి అన్వేష్, ఆరే రమేష్ రెడ్డి, భోగం చిరంజీవి, రెడ్డి సారంగం, భోగం సాయిరాం, రావుల రాజబాబు, సామల రాజిరెడ్డి, ఇంద్రారెడ్డి, రేణికుంట్ల రవీందర్, కుమారస్వామి, ఐలయ్య, సామ శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వంశీ, జలేందర్ రెడ్డి, తిరుపతి శంకర్, రాజయ్య, పెద్ద గట్టయ్య, చిన్న గట్టయ్య, అజ్గర్ పాషా, ఎండి లాల్, రాజు, మోహన్, కుమార్, అశోక్, గణేష్, రాకేష్, వంశీకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.





## ఎల్‌నీనో ప్రభావంపై మున్సిపల్ అప్రమత్తం

- ఎల్‌నీనో ప్రభావం.. ముందస్తు చర్యలకు అధికారులకు ఆదేశాలు

**హుజురాబాద్, జూలై 23(తెలంగాణ ముచ్చట్లు ):** ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు, మున్సిపల్ కమిషనర్ బి. కిషన్, ఏఈ నరేష్‌తో కలిసి వాటర్ సప్లై విభాగం అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్‌నీనో ప్రభావం వల్ల తాగునీటి సరఫరా, నీటి నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణపై ఎలాంటి ప్రతికూల పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పైప్‌లైన్లు, మోటార్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి నిల్వ కేంద్రాలను నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.

ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. సమావేశంలో వాటర్ సప్లై విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌పై ధర్మసాగర్‌లో కాంగ్రెస్ నాయకుల నిరసన






- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

**ధర్మసాగర్,జులై23(తెలంగాణ ముచ్చట్లు):** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ధర్మసాగర్ సర్కిల్ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పెసరు రమేష్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. పేపర్ లీక్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు పరిరక్షణ కోసం గ్రామ గ్రామాన తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌పై వేలేరులో కాంగ్రెస్ ఆందోళన





- ప్రధాని దిష్టిబొమ్మ దహనం..
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

**వేలేరు,జులై23(తెలంగాణ ముచ్చట్లు):** నీట్ పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ వేలేరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పీసీసీ, డీసీసీ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మురవత్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వేలేరు గ్రామ సర్పంచ్ బిల్ల యాదగిరి, మాజీ సర్పంచ్ విజయపురి మల్లికార్జున్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విద్యార్థుల ఎన్నో సంవత్సరాల కష్టం, ఆశయాలను దెబ్బతీసిన ఈ ఘటన దేశ విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా, పటిష్ఠంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేసి, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో విద్యా వ్యవస్థపై మళ్లీ విశ్వాసం కల్పించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.అలాగే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టులను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మురవత్ లక్ష్మణ్ నాయక్, వేలేరు గ్రామ సర్పంచ్ బిల్ల యాదగిరి, మాజీ సర్పంచ్ విజయపురి మల్లికార్జున్, శాలపల్లి సర్పంచ్ కూరపాటి అశోక్, ఏఎంసీ డైరెక్టర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి సంపత్, ఉపసర్పంచులు, మండల, గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులకు న్యాయం చేయాలి





- రామడుగులో కాంగ్రెస్ నిరసన ర్యాలీ

**రామడుగు,జులై23(తెలంగాణ ముచ్చట్లు):** నీట్ పరీక్ష వ్యవహారంలో విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రామడుగు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసం వద్ద విద్యార్థుల సమస్యలపై శాంతియుతంగా ఆందోళన చేపట్టిన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ఛత్రపతి శివాజీ విగ్రహం వరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ పరీక్షను రద్దు చేసి రాష్ట్రాలకే నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులపై లాఠీచార్జి జరగడానికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా పదవికి రాజీనామా చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం, సర్పంచులు దావా అనంతరెడ్డి, మొయిజ్, ఉప్పుని అంజని ప్రసాద్, వెన్నె రాజ మల్లయ్య, పంజాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు గునుగొండ అశోక్, కాడ శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనుపురం పరశురాం గౌడ్, జక్కుల బాబు, కత్తి మధు, ఆత్మ కమిటీ సభ్యుడు బండారి భువన్ గౌడ్, కర్ణ శీను, అజయ్, మహేష్, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజమ్, ఈశ్వర్, వెంకటేష్, రవి, మల్లేశం, స్వామి, వేణు, అంజయ్య, పోశయ్యతో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలి: తెలంగాణ రక్షణ సేన మండల అధ్యక్షుడు అంబల హరీష్

**జమ్మికుంట టౌన్ జులై 23 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన మండల అధ్యక్షుడు అంబల హరీష్ డిమాండ్ చేశారు.

ఆయన మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. భోజనంలో నాణ్యత లోపించడం, అన్నంలో పురుగులు కనిపించడం, సాంబార్ నాసిరకంగా ఉండటం, తాగునీరు, స్నానానికి అవసరమైన నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఈ సమస్యలపై విద్యార్థినులు లేదా వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, పాఠశాల యాజమాన్యం సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పాఠశాలకు సమీపంలోనే మండల స్థాయి అధికారులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఎవరూ వచ్చి పరిస్థితిని పరిశీలించకపోవడం విచారకరమన్నారు.

విద్యార్థుల సంక్షేమం పట్ల సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఆహార నాణ్యత, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించకపోతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అంబల హరీష్ హెచ్చరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

## స్వీయ సంరక్షణతోనే గుండెజబ్బులు, పక్షవాతానికి అడ్డుకట్ట




**వనపర్తి,జూలై23(తెలంగాణ ముచ్చట్లు):**ప్రతి వ్యక్తి తన ఆరోగ్యాన్ని తానే కాపాడుకునే అలవాట్లను పెంపొందించుకోవడం ద్వారా గుండెజబ్బులు, పక్షవాతం వంటి ప్రాణాంతక వ్యాధులను గణనీయంగా నివారించవచ్చని 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ పేర్కొంది. జూలై 24న నిర్వహించే స్వీయ సంరక్షణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర 108 అంబులెన్స్ సేవల కార్యనిర్వాహణ అధికారి బి. సుధాకర్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.స్వీయ సంరక్షణ అనేది కేవలం అనారోగ్యం వచ్చినప్పుడు మాత్రమే కాదు, ప్రతి రోజూ పాటించాల్సిన జీవన విధానమని ఆయన తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం, మానసిక ప్రశాంతతను కాపాడుకోవడం, అవసరమైన వైద్య పరీక్షలను నిర్దిష్ట వ్యవధిలో చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే నివారించవచ్చని సూచించారు.108 ఈఎంఆర్ఐ అత్యవసర సేవల నిర్వహణ నివేదిక ప్రకారం, 2026 జనవరి నుంచి జూన్ వరకు తెలంగాణలో 17,940 ఛాతీ నొప్పి అత్యవసర కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు వారిలోనూ గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. రక్తపోటు, ఉపవాస రక్తంలో చక్కెర, రక్తంలోని కొవ్వు స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవడంతో పాటు సమతుల్య ఆహారం, నిత్య వ్యాయామం, ఒత్తిడిని తగ్గించే అలవాట్లు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ప్రజల కోసం ఐదు దశల స్వీయ సంరక్షణ ప్రణాళికను కూడా సంస్థ సూచించింది. ప్రతి భోజనంలో ఒక పండు, ఒక కూరగాయ తీసుకోవడం, రాత్రి భోజనం అనంతరం కనీసం అరగంట నడవడం, పొగాకు, మద్యానికి పూర్తిగా దూరంగా ఉండడం, ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తపోటు పరీక్ష చేయించుకోవడం, నిద్రకు ముందు కొద్ది నిమిషాలు ధ్యానం చేయడం వంటి అలవాట్లు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు.గత ఆరు నెలల్లో తెలంగాణలో 5,025 పక్షవాత అత్యవసర కేసులు నమోదైనట్లు వెల్లడించారు. అధిక రక్తపోటు, మధుమేహం, గుండెజబ్బులు, అధిక కొవ్వు, అనారోగ్యకర జీవనశైలి పక్షవాతానికి ప్రధాన కారణాలని తెలిపారు. వీటిని నియంత్రించడానికి స్వీయ సంరక్షణే ఉత్తమ మార్గమని వివరించారు.స్వీయ సంరక్షణ వల్ల ఒత్తిడి తగ్గడం, శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటం, పనితీరు పెరగడం, ఆత్మవిశ్వాసం బలపడటం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. పోషకాహారం, తగిన నిద్ర, యోగా, ధ్యానం, పుస్తక పఠనం, సంగీతం వినడం, కుటుంబ సభ్యులు, స్నేహితులతో సమయం గడపడం, కొంత సమయం మొబైల్ ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండడం కూడా స్వీయ సంరక్షణలో భాగమేనని పేర్కొన్నారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సమాచారం ఇవ్వడం కూడా స్వీయ సంరక్షణలో అత్యంత కీలకమైన చర్య అని బి. సుధాకర్ తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు 108 సిబ్బందికి నిరంతరం ఆధునిక శిక్షణ అందిస్తూ అత్యవసర వైద్య సేవలను మరింత సమర్థంగా అందిస్తున్నామని పేర్కొన్నారు.

## మహ్మద్ హుస్సేన్‌పల్లిలో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం



**మూసాపేట్, జూలై 23(తెలంగాణ ముచ్చట్లు):** మూసాపేట్ మండలం మహ్మద్ హుస్సేన్‌పల్లిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా 32, 33 బూత్‌లలో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. అధికారులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో చేపట్టిన ఈ కార్యక్రమం సజావుగా సాగింది.32వ బూత్‌లో మొత్తం 708 మంది ఓటర్లు ఉండగా, పరిశీలనలో మరణించిన మరియు డబుల్ నమోదైన 38 మంది పేర్లను తొలగించడంతో ప్రస్తుతం 670 మంది ఓటర్లు మిగిలారు. అలాగే 33వ బూత్‌లో 647 మంది ఓటర్లు ఉండగా, మరణించిన మరియు డబుల్ నమోదైన 40 మంది పేర్లను తొలగించడంతో ప్రస్తుతం 607 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.గురువారం నిర్వహించిన కార్యక్రమాన్ని మూసాపేట్ మండల ఆర్ఐ రవిశంకర్, జూనియర్ అసిస్టెంట్ అంజన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 32వ బూత్‌లో విధులను సమర్థవంతంగా నిర్వహించిన బీఎల్ఓ పద్మ, బీఎల్ఏ ఎం. దేవన్న యాదవ్‌ను అభినందించారు. అలాగే 33వ బూత్‌లో ఎన్యూమరేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన బీఎల్ఓ అరుణను లావణ్య మరియు సీమంతమ్మ అభినందించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నామని, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడానికి ప్రజలు సహకరించాలని కోరారు. అధికారులు, సిబ్బంది, బీఎల్ఓలు, బీఎల్ఏల సమిష్టి కృషితో మహ్మద్ హుస్సేన్‌పల్లిలో ఎన్యూమరేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని తెలిపారు.

# గ్రామీణాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: వొడితల ప్రణవ్





- **బొంతుపల్లిలో బస్సు సర్వీసు, రైతులకు ఉపయోగపడే కల్వర్టు ప్రారంభం.**

**వీణవంక, జులై 23 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామాల అభివృద్ధి, గ్రామీణ రవాణా వ్యవస్థ బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజలకు సౌలభ్యం, రైతులకు మౌలిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గురువారం జమ్మికుంట-గద్దపాక మధ్య నూతనంగా ప్రారంభమైన బస్సు సర్వీసును వీణవంక మండలంలోని బొంతుపల్లి గ్రామంలో ప్రణవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మంగళహారతులతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించిన ప్రణవ్, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి తదితర సంక్షేమ పథకాలపై మహిళల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలతో తమకు ఎంతో మేలు జరుగుతోందని మహిళలు తెలిపారు.

అంతకుముందు గ్రామంలో రూ.8 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన కల్వర్టును కూడా ఆయన ప్రారంభించారు. ఈ కల్వర్టు ద్వారా సుమారు 60 ఎకరాల సాగుభూమికి రాకపోకలు సులభమవడంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ అవసరాన్ని తన దృష్టికి తీసుకురాగానే నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేసిన ప్రణవ్‌కు గ్రామస్థులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందించి వారి సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో 'ఇందిరా మహిళా శక్తి' వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను విస్తరించడం ద్వారా విద్యార్థులు, మహిళలు, రైతులు, సాధారణ ప్రజలకు మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు.

జమ్మికుంట-గద్దపాక బస్సు సర్వీసును గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సర్వీసు మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వీణవంక మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులపై ఆకస్మిక తనిఖీ





- **వేకువనే రంగంలోకి దిగిన చైర్‌పర్సన్**

**హుజూరాబాద్, జూలై 23(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతమైన వాతావరణంతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు గురువారం ఉదయం 5 గంటలకే ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వేకువజామునే పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, కాలనీలు, డ్రైనేజీలు, చెత్త సేకరణ కేంద్రాలను సందర్శించి పారిశుద్ధ్య పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బంది హాజరు, పనుల నిర్వహణ, చెత్త సేకరణ ప్రక్రియ, డ్రైనేజీల శుభ్రత, రోడ్ల ఊడ్చివేత తదితర అంశాలను పరిశీలిస్తూ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతిరోజూ ఉదయం నుంచే పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలని, పట్టణంలోని ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేసిన చైర్‌పర్సన్, విధుల్లో అలసత్వం ప్రదర్శించే వారిపై అవసరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం మున్సిపాలిటీ ప్రధాన బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడం, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పట్టణ అభివృద్ధితో పాటు పరిశుభ్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్న చైర్‌పర్సన్, ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రత పాటించాలని, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే హుజూరాబాద్‌ను ఆదర్శ పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని ఆమె అన్నారు.

## తక్కువ వర్షపాతం నేపథ్యంలో పంటల మార్పిడిపై రైతులకు అవగాహన



**పెద్దమందడి,జూలై23(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం జంగమ్మయ్యపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో రైతులకు పంటల మార్పిడిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుంటే దిగుబడులను కాపాడుకోవడంతో పాటు నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.తక్కువ నీటితో సాగు చేయగల కందులు, మినుములు, వేరుశనగ, కూరగాయల పంటలు, ఆయిల్ పామ్ సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. నేల స్వభావం, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని పంటలను సాగు చేయాలని, శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు అందించే సూచనలు, సలహాలను పాటిస్తూ సాగు చేపట్టాలని రైతులకు సూచించారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్, మండల అభివృద్ధి అధికారి, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితర అధికారులు పాల్గొన్నారు.

# శ్రీలంక స్థానిక ప్రజాప్రతినిధుల బృందం ములుకనూరు సహకార సంఘం సందర్శన

**భీమదేవరపల్లి, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రాయోజితంగా నిర్వహిస్తున్న 10 రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా శ్రీలంకకు చెందిన 32 మంది స్థానిక ఎన్నికైన ప్రజాప్రతినిధుల బృందం గురువారం ములుకనూరు సహకార సంఘాన్ని సందర్శించింది.జాతీయగ్రామీణాభివృద్ధి ,పంచాయతీ రాజ్ సంస్థ (NIRDPR), హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పర్యటనలో, ములుకనూరు కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఆలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ప్రతినిధులకు సంఘం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న సేవలు, సహకార సంఘం పనితీరు గురించి సమగ్రంగా వివరించారు.



అనంతరం ప్రతినిధులతో పరస్పర చర్చలు నిర్వహించి, వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అంతర్జాతీయ ప్రతినిధి బృందం సందర్శన కోసం ములుకనూరు కోఆపరేటివ్‌ను ఎంపిక చేయడం, సభ్య రైతుల జీవితాల్లో ములుకనూరు మోడల్ తీసుకొచ్చిన గణనీయమైన మార్పులకు నిదర్శనమని ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు.అలాగే, తమ తమ ప్రాంతాల్లో సాధ్యమైన మేరకు ములుకనూరు మోడల్‌లోని ఉత్తమ కార్యక్రమాలను అమలు చేయాలని శ్రీలంక ప్రతినిధులకు సూచించారు. ఈ సందర్శనతో ములుకనూరు సహకార సంఘం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు పొందింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## వెన్న రాజు నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలి

- **ఎల్కతుర్తి మండల జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు పప్పుల గంగాధర్**

**ఎల్కతుర్తి, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):-** హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వెన్న రాజును ఎల్కతుర్తి మండల జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు పప్పుల గంగాధర్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వెన్న రాజు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ మండలంలో మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా పప్పుల గంగాధర్ మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి వెన్న రాజు సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధితో పాటు సామాజిక న్యాయం, అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మరింత ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు.

నూతన అధ్యక్షుడు వెన్న రాజు మాట్లాడుతూ, తనపై పార్టీ అధిష్ఠానం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కార్యకర్తల సహకారంతో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాచెర్ల మల్లయ్య, మాచెర్ల మల్లేశం, మాచెర్ల శ్రీనివాస్, మాచెర్ల నరేష్తో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, జాతీయ మాల మహానాడు నాయకులు పాల్గొని వెన్న రాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.



## విద్యార్థులకు డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన

**వేలేరు, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం జడ్ పి ఎచ్ ఎస్ పీచర పాఠశాలలో డ్రగ్స్ దుష్పరిణామాలు, పరిసరాల పరిశుభ్రత, దోమలు, ఈగలు, కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీ ఎచ్ ఈ ఓ సాయిని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. మానసిక ఆరోగ్య సమస్యలు ఎవరికైనా రావచ్చని, తనలో తానే మాట్లాడుకోవడం, తనను తానే నిందించుకోవడం, ఆత్మహత్య ఆలోచనలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే 14416 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సహాయం పొందాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎచ్ ఈ ఓ సాయిని వెంకటేశ్వర్లు, ఏ ఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయురాలు ఎం. శ్రీదేవి, ఉపాధ్యాయులు వేణుగోపాల్ రాజు, భాస్కర్, రవిచందర్, సుభాష్, రాజు కుమార్, నరసింహతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎంపిని అవమానించడం దారుణం

- **విశాఖ ట్రస్టు ద్వారా అనేక సేవలు అందించిన ఘనత కాకా కుటుంబానిది**
- **దండేపల్లి కాంగ్రెస్ నాయకులు ఎంపి కి క్షమాపణలు చెప్పాలంటూ**
- **ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్ డిమాండ్**

**మంచిర్యాల, జులై 23 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలోని దండేపల్లి, లక్షెట్టిపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు సొంత పార్టీ పార్లమెంట్ సభ్యునికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం మూర్ఖత్వమని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైడిమల నర్సింగ్ ఆరోపించారు, బుధవారం స్థానిక మందమర్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేయడానికి వచ్చిన క్రమంలో ఎంపీ ని స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకొని ప్లెక్సీలు చించి వేయడం దారుణం అని పేర్కొన్నారు, పదవులు లేనప్పటి నుండి కాక కుటుంబం విశాఖ ట్రస్టు ద్వారా అనేక సేవలను అందించిన విషయాన్ని గుర్తు చేశారు, సేవా కార్యక్రమాలకు రాజకీయ రంగు పూయడం సరికాదని తెలిపారు, అంబేద్కర్ సంఘం ముసుగులో దండేపల్లి కాంగ్రెస్ నాయకులు దళిత ఎంపీని అవమానపరుస్తున్నారంటే దళిత జాతిని అవమానపరిచినట్టేనని మండిపడ్డారు, వెంటనే ఎంపీ వంశీ కృష్ణ కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ సి సెల్ జిల్లా అధ్యక్షుడు సంఘీ సంతోష్, కనకం రాజు, మద్దెల విజయ్, సుద్దాల రాజ్ కుమార్, సామిల్,గడ్డం శ్రీనివాస్, చిప్పకుర్తి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలి





- **ఆర్డీఓ సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్**

**జమ్మికుంట టౌన్ జులై 23 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్హుడైన ఓటరుకు ఓటరు జాబితాలో చోటు కల్పించేలా స్థానిక కౌన్సిలర్లు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

అనంతరం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో పట్టణంలోని 30 వార్డుల కౌన్సిలర్లు, బీఎల్ఓలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రతి అర్హుడైన ఓటరును గుర్తించి, ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వంద శాతం విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, తహసీల్దార్, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఎల్ఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో రాజకీయ వేడి.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ ఆందోళన






**జమ్మికుంట టౌన్ జులై 23 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ శాఖ అధ్యక్షుడు కొలకాని రాజు నాయకత్వంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, దేశ రాజధానిలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల పేరుతో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ప్రోత్సహించడం సరైంది కాదని విమర్శించారు. ప్రజాస్వామ్య నిరసనలు శాంతియుతంగా జరగాలని, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం దేశంలో ఉద్రిక్త పరిస్థితులను సృష్టించే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ప్రజలు ఇటువంటి చర్యలను తిరస్కరించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు జీడి మల్లేష్, రాజేష్ ఠాకూర్, కైలాసకొటి గణేష్, అడువాల శ్రీధర్, కొమ్ము అశోక్, కేస స్వరూప్, ఇటుకాల స్వరూప్, గంగాభవాని, రాకేష్ ఠాకూర్, సతీష్, సురేష్, నగేష్, బల్సుకురి రాజేష్, శ్రీవర్ధి ప్రవీణ్, ఆకుల పోచయ్య, నసీరుద్దీన్, బొనగిరి ప్రణీత్, పనికారి రమేష్, అనిల్, ఉడుగుల మహేందర్, కొండపర్తి ప్రవీణ్, నెల్లి రాజు, సమ్మిరెడ్డి, యాంసాని సమ్మయ్య, అప్పాల రవీందర్, కొలకాని అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుడి మృతితో విషాదం.. కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు

- **ప్రసాద్ కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సాయం అందించిన 1988–89 బ్యాచ్ మిత్రులు**

**భీమదేవరపల్లి, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన పోగుల ప్రసాద్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన 1988-89 బ్యాచ్‌కు చెందిన చిన్ననాటి స్నేహితులు తమ ఆత్మీయ మిత్రుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.




ప్రసాద్ మృతి ఆయన కుటుంబానికి తీరని లోటని పేర్కొన్న స్నేహితులుమానవత్వాన్ని చాటుతూ ఆయన కుటుంబానికి తమ వంతు సహాయంగా రూ.35 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని ప్రసాద్ భార్య అరుణ, కుమారులు అరుణ్, అజిత్‌లకు అందజేసి, భవిష్యత్తులో కూడా తమ స్నేహితులందరి తరఫున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాశిరెడ్డి ఆదిరెడ్డి, గౌడ చంద్రబాబు, మామిడాల చంద్రశేఖర్, కడారి మొగిలి, నల్లగొండ శంకర్, మాడుగుల రవీందర్, చిట్కూరి వెంకటస్వామి తదితర చిన్ననాటి మిత్రులు పాల్గొన్నారు. వారి ఈ ఆప్యాయ సహకారం గ్రామస్థుల ప్రశంసలు అందుకుంది.

## నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల ఉద్యమాలను అణచివేయడం దారుణం

- **హైదరాబాద్ నిరసనకు విద్యార్థులు, యువత భారీగా తరలిరావాలి: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి,జూలై23(తెలంగాణ ముచ్చట్లు):** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్న విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న అణచివేత ధోరణిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలియజేయడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని, ఆ హక్కులను కాలరాయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు.హైదరాబాద్‌లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి సంబంధించి తన నివాసంలో విద్యార్థి, యువజన విభాగాల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.నీట్ పరీక్షలో జరిగిన అక్రమాల వల్ల దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్న నిరంజన్ రెడ్డి, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత స్వీకరించి రాజీనామా చేయాలని ఆయన కోరారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, సమస్యలను పరిష్కరించాల్సింది పోయి ఉద్యమాలను అణచివేయడం సరైన విధానం కాదన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే ప్రతి ఒక్కరూ ఇటువంటి చర్యలను ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, చెన్నారం రమేష్, మహమూద్, బండారు కృష్ణ, చంద్రశేఖర్, డాక్టర్ డ్యానియల్, భాగ్యరాజ్, సయ్యద్ జమీల్, బాబు నాయక్, అస్లాం, ఇమ్రాన్, జిల్లా విద్యార్థి కోఆర్డినేటర్ హేమంత్ ముదిరాజ్, యువత అధ్యక్షుడు సూర్యవంశం గిరి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జోహెబ్ హుస్సేన్, యూసుఫ్, మండల యువత అధ్యక్షుడు చిట్యాల రాము, మునికుమార్, క్రాంతి, లక్ష్మణ్ గౌడ్, శివప్రసాద్ గౌడ్, శిరివాటి శంకర్, కుమార్, అలీమ్ పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# విద్యా వ్యవస్థ పరిరక్షణకు విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి

**ఎన్ఎస్‌యూఐ రామడుగు మండల అధ్యక్షుడు జవ్వాజి అజమ్ పిలుపు**



**రామడుగు,జులై23(తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం కావడం, వరుస పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఎన్ఎస్‌యూఐ రామడుగు మండల అధ్యక్షుడు జవ్వాజి అజమ్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జూలై 24న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాత్రింబవళ్లు శ్రమించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల ఆశలతో వరుస పేపర్ లీకేజీల ద్వారా చెలగాటమాడడం అత్యంత దురదృష్టకరమన్నారు. విద్యార్థుల ఆందోళనలకు స్పందించి సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, ప్రశ్నించిన విద్యార్థులపై ఢిల్లీలో లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.

విద్యారంగానికి తగిన నిధులు కేటాయించకుండా, విద్యార్థుల ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా వ్యవస్థ బలోపేతం, యువత భవిష్యత్తు రక్షణ కోసం ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ, బీజీవీఎస్ తదితర విద్యార్థి సంఘాల సంయుక్త పిలుపు మేరకు నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌కు మేధావులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి విజయవంతం చేయాలని జవ్వాజి అజమ్ కోరారు.



# మీనాక్షి నటరాజన్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటిన పిడమర్తి రవి

**హనుమకొండ,జులై23(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, మాజీ పార్లమెంట్ సభ్యురాలు మీనాక్షి నటరాజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ పిడమర్తి రవి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టినరోజు వేడుకలను ఆర్భాటాలకు దూరంగా పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే విధంగా మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. మీనాక్షి నటరాజన్ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామన్ గౌడ్, నక్క మహేష్, దేవరకొండ నరేష్, ఎస్.కె. రహీం, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# కొత్తకోటలో 233వ బూత్‌కు వంద శాతం మార్కు

- బీఎల్ఓ విక్టోరియా సంపత్‌కు సన్మానం



**కొత్తకోట,జూలై23(తెలంగాణ ముచ్చట్లు):** కొత్తకోట మున్సిపల్ పరిధిలోని 233వ పోలింగ్ బూత్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో గణన పత్రాల పూరింపును వంద శాతం పూర్తి చేసినట్లు బీజేపీ ఉపాధ్యక్షుడు, బీఎల్ఏ2 (233వ బూత్) కొమ్ము భరత్ భూషణ్ తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు బూత్ పరిధిలోని ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయడంతో పాటు మరణించిన వారు, వలస వెళ్లిన వారు, డబుల్ ఓట్లు ఉన్న వారి వివరాలను గుర్తించి జాబితాను ప్రక్షాళన చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సమర్థవంతంగా విధులు నిర్వహించి గణన పత్రాల పూరింపును విజయవంతంగా పూర్తి చేసిన బీఎల్ఓ విక్టోరియా సంపత్‌ను స్థానిక నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.233వ బూత్‌లో మొత్తం 735 మంది ఓటర్లు ఉండగా, వారిలో 635 మంది వివరాలు సక్రమంగా నమోదు చేశారు. పరిశీలనలో 25 మంది మరణించినట్లు, 75 మంది వలస వెళ్లినట్లు లేదా డబుల్ ఓట్లు ఉన్నట్లు గుర్తించి మొత్తం 100 ఓట్లను జాబితా నుంచి తొలగించినట్లు తెలిపారు. దీంతో బూత్‌లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తిస్థాయిలో విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో డేవిడ్ రాజ్, కొమ్ము అనిల్, జయరాజ్, భాగ్యమ్మ, సంతోషమ్మ, ఆటో యేసు, చెన్నయ్య, జఖీ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల యూనిఫాంలపై ఫీడ్‌బ్యాక్ సేకరణ

- వాట్సాప్ ద్వారా అభిప్రాయాలు తీసుకోనున్న ప్రభుత్వం
- ఆగస్టు 15లోగా అందరికీ యూనిఫాంల పంపిణీ
- నాణ్యత విషయంలో రాజీ లేదన్న ముఖ్యమంత్రి



**హైదరాబాద్, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన అనంతరం వాటి నాణ్యత, సైజు, రంగు తదితర అంశాలపై ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపడతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి యూనిఫాంల పంపిణీ విధానం, రంగులు, ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన యూనిఫాంలు అందించడంలో ఎలాంటి రాజీ ఉండదని అధికారులకు స్పష్టం చేశారు. ఆగస్టు 15వ తేదీలోగా రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి యూనిఫాంలు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరిగినా సహించబోమని హెచ్చరించారు. మహిళా సంఘాలు యూనిఫాంల కుట్టు పనులను వేగవంతం చేసేలా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గతంలో యూనిఫాంల పంపిణీ వ్యవస్థలో లోపాలు ఉన్నాయని పేర్కొన్న ముఖ్యమంత్రి, ప్రస్తుతం మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ నాణ్యమైన యూనిఫాంలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేద విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 2వ తేదీ నాటికే విద్యార్థులకు యూనిఫాంలు అందేలా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్, ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యాదాద్రిలో వరుణ యాగం పూర్ణాహుతి





- సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థనలు
- రైతాంగ సంక్షేమానికి ప్రత్యేక పూజలు
- ప్రకృతి సమతుల్యతకు ప్రభుత్వం కృషి

**యాదాద్రి, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ గురువారం పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో ప్రకృతిని దైవస్వరూపంగా భావిస్తారని పేర్కొన్నారు. వరుణ యాగం కేవలం వైదిక క్రతువు మాత్రమే కాకుండా ప్రకృతి సమతుల్యత, ప్రజల శ్రేయస్సు, రైతాంగ సంక్షేమం కోసం నిర్వహించే పవిత్ర యాగమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, నదులు, జలాశయాలు నిండుకుండల్లా కళకళలాడాలని, రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని మంత్రి చెప్పారు. పచ్చని తెలంగాణ మరింత పచ్చదనంతో విరాజిల్లాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రకృతి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే చర్యలతో పాటు దైవానుగ్రహం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో వరుణ యాగాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రకృతి పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రాష్ట్ర ప్రజల శాంతి, సుభిక్షాల కోసం ఈ యాగాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రతి రైతు కుటుంబంలో ఆనందం నెలకొనాలని ఆకాంక్షించారు. వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొని రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని ప్రార్థించారు.

# సుశాంత్‌పై అభిమానాన్ని పంచుకున్న ఐశ్వర్య రాజేశ్

**హైదరాబాద్, జులై 23 (తెలంగాణ ముచ్చట్లు):** దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి ఐశ్వర్య రాజేశ్ తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా దివంగత బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌పై తనకున్న అభిమానాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. హీరోయిన్‌గా పరిచయం కాకముందే సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆయన నటనకు పెద్ద అభిమానినని ఐశ్వర్య తెలిపారు. స్నేహితులతో తరచూ ఆయన గురించి మాట్లాడేదాన్నని చెప్పారు.

ఒకసారి గోవాలో జరిగిన చలనచిత్రోత్సవానికి వెళ్లినప్పుడు సుశాంత్‌ను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించిందని, ఆయనతో ఒక ఫొటో దిగాలని ఎంతో ఆశపడ్డానని చెప్పారు. ఆ తర్వాత జరిగే వేడుకకు ఆయన వస్తారని భావించి ఎదురుచూసినా, సుశాంత్ అక్కడికి రాకపోవడంతో నిరాశ చెందానని వెల్లడించారు. మరుసటి రోజు తాను బస చేసిన గదికి పక్కనే సుశాంత్ ఉన్నారని తెలిసి మరింత బాధ కలిగిందని, అంత దగ్గరలో ఉన్నా కలిసే అవకాశం దక్కకపోవడం ఇప్పటికీ గుర్తుండిపోయే విషయమని ఐశ్వర్య పేర్కొన్నారు. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అసాధారణ ప్రతిభ కలిగిన నటుడని, చాలా చిన్న వయసులోనే ఆయన మరణించడం సినీ పరిశ్రమకు తీరని లోటని ఆమె అన్నారు. ఆయనపై తనకున్న అభిమానం ఇప్పటికీ అలాగే ఉందని ఐశ్వర్య రాజేశ్ వెల్లడించారు.



# కృత్రిమ మేధ యుగంలో..
# మనిషి నైపుణ్యాల భవిష్యత్

- ఆవిష్కరణల వేగంలో కొత్త అవకాశాలు
- మారుతున్న ఉద్యోగ రంగానికి నైపుణ్యాలే బలం
- సాంకేతికతతో పాటు మానవ విలువలూ అవసరం
- భవిష్యత్‌కు సిద్ధమయ్యే సమయం ఇదే

డెస్క్, జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు): :

ప్రపంచం ప్రస్తుతం కృత్రిమ మేధ యుగంలో వేగంగా అడుగులు వేస్తోంది. కొన్ని సంవత్సరాల క్రితం ఊహకే పరిమితమైన అనేక పనులను నేడు యంత్రాలు క్షణాల్లో పూర్తి చేస్తున్నాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, బ్యాంకింగ్, రవాణా, మీడియా, వినోదం వంటి దాదాపు ప్రతి రంగంలో కృత్రిమ మేధ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలు మానవ జీవితాన్ని సులభతరం చేస్తున్నప్పటికీ, ఉద్యోగాల భవిష్యత్, మానవ నైపుణ్యాల ప్రాధాన్యంపై కొత్త ప్రశ్నలను కూడా లేవనెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మార్పులను భయపడకుండా వాటికి అనుగుణంగా మనల్ని మనం తీర్చిదిద్దుకోవడం అత్యవసరంగా మారింది. గతంలో యంత్రాలు కేవలం శారీరక శ్రమను మాత్రమే తగ్గించేవి. ఇప్పుడు కృత్రిమ మేధ సమాచారాన్ని విశ్లేషించడం, నివేదికలు తయారు చేయడం, భాషలను అనువదించడం, చిత్రాలు రూపొందించడం, లెక్కలు వేయడం, సాఫ్ట్‌వేర్ తయారు చేయడం వంటి మేధో సంబంధిత పనులను కూడా వేగంగా నిర్వహిస్తోంది. దీనివల్ల కొన్ని సాంప్రదాయ ఉద్యోగాలపై ప్రభావం పడుతున్నప్పటికీ, మరోవైపు పూర్తిగా కొత్త ఉద్యోగ అవకాశాలు కూడా పుట్టుకొస్తున్నాయి. చరిత్రను పరిశీలిస్తే ప్రతి సాంకేతిక విప్లవం పాత పనుల్లో మార్పులు తీసుకొచ్చినా, కొత్త రంగాలకు కూడా తలుపులు తెరిచింది. కాబట్టి కృత్రిమ మేధను ఉద్యోగాల అంతానికి సంకేతంగా కాకుండా, ఉద్యోగాల స్వరూపాన్ని మార్చే శక్తిగా చూడాల్సిన అవసరం ఉంది.


ఈ మార్పుల నేపథ్యంలో విద్యా వ్యవస్థలో కూడా సమూల మార్పులు అవసరమవుతున్నాయి. కేవలం పాఠ్యపుస్తకాల్లోని విషయాలను కంఠస్థం చేయడం భవిష్యత్‌లో సరిపోదు. సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, కొత్త పరిష్కారాలను కనుగొనే నైపుణ్యం, సమర్థవంతమైన సంభాషణ, బృందంతో కలిసి పనిచేసే సామర్థ్యం వంటి లక్షణాలు మరింత విలువైనవిగా మారుతున్నాయి. విద్యాసంస్థలు కూడా విద్యార్థులను పరీక్షలకే పరిమితం చేయకుండా, జీవిత నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనా దృక్పథం పెంపొందించే దిశగా అడుగులు వేయాల్సి ఉంది. ఉద్యోగ రంగంలో పనిచేస్తున్న వారికి కూడా నిరంతర అభ్యాసం తప్పనిసరిగా మారుతోంది. ఒకసారి నేర్చుకున్న విద్యతో జీవితాంతం ఉద్యోగం కొనసాగించే పరిస్థితి క్రమంగా మారుతోంది. సాంకేతికత మారినప్పుడల్లా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం, అవసరమైన శిక్షణ పొందడం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ సామర్థ్యాలను పెంపొందించుకోవడం అత్యంత అవసరం. సంస్థలు కూడా ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ మార్పులకు సిద్ధం చేయాల్సిన బాధ్యతను గుర్తించాలి.

అయితే కృత్రిమ మేధ ఎంత అభివృద్ధి చెందినా, మనిషికి మాత్రమే ఉన్న కొన్ని ప్రత్యేక లక్షణాలను అది పూర్తిగా భర్తీ చేయలేదు. మానవీయత, భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, నైతిక నిర్ణయాలు తీసుకోవడం, సృజనాత్మకత, నాయకత్వం, బాధ్యతాయుత ఆలోచన వంటి అంశాల్లో మనిషి పాత్ర ఎప్పటికీ కీలకంగానే ఉంటుంది. వైద్యుడు రోగితో మాట్లాడే తీరు, ఉపాధ్యాయుడు విద్యార్థిలో ఆత్మవిశ్వాసం నింపే విధానం, న్యాయమూర్తి సామాజిక కోణాలను పరిగణనలోకి తీసుకుని తీర్పు ఇవ్వడం వంటి అనేక అంశాల్లో మానవ విలువలకు ప్రత్యామ్నాయం లేదు. కృత్రిమ మేధ వినియోగం పెరుగుతున్న కొద్దీ నైతిక సవాళ్లు కూడా పెరుగుతున్నాయి. వ్యక్తిగత సమాచార భద్రత, తప్పుడు సమాచార వ్యాప్తి, ఉద్యోగాలపై ప్రభావం, యంత్రాల నిర్ణయాల్లో పారదర్శకత వంటి అంశాలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశాలుగా మారాయి. అందువల్ల సాంకేతిక అభివృద్ధితో పాటు బాధ్యతాయుత వినియోగానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి స్పష్టమైన విధానాలు రూపొందించి ప్రజల్లో డిజిటల్ అవగాహన పెంచాలి.

భారత్ వంటి యువ జనాభా అధికంగా ఉన్న దేశానికి కృత్రిమ మేధ ఒక గొప్ప అవకాశంగా మారవచ్చు. మన యువతకు సరైన నైపుణ్య శిక్షణ, నాణ్యమైన విద్య, పరిశోధనలకు ప్రోత్సాహం, నవ్య ఆలోచనలకు వేదికలు కల్పిస్తే ప్రపంచ సాంకేతిక రంగంలో భారతదేశం మరింత కీలక స్థానాన్ని సంపాదించగలదు. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాలకూ సాంకేతిక విద్యను విస్తరించి డిజిటల్ అంతరాన్ని తగ్గించడం కూడా అంతే ముఖ్యం. కృత్రిమ మేధను ప్రత్యర్థిగా కాకుండా సహాయకుడిగా స్వీకరించినప్పుడే నిజమైన ప్రయోజనం లభిస్తుంది. పునరావృతమయ్యే పనులను యంత్రాలకు అప్పగించి, సృజనాత్మకత, పరిశోధన, ఆవిష్కరణ, మానవ సంబంధాల వంటి రంగాల్లో మనిషి తన ప్రతిభను మరింత మెరుగ్గా వినియోగించుకోవచ్చు. సాంకేతికత మనిషి సామర్థ్యాన్ని తగ్గించడానికి కాదు, విస్తరించడానికి ఉపయోగపడాలనే దృక్పథం సమాజంలో పెరగాలి.

విద్యా విధానాలు, ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమల అవసరాలు పరస్పరం అనుసంధానమైతేనే ఈ మార్పు విజయవంతమవుతుంది. ప్రతి యువకుడు జీవితాంతం నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలి. ఉద్యోగ భద్రత కంటే నైపుణ్య భద్రత ముఖ్యమనే భావనను సమాజం అంగీకరించాలి. నేర్చుకునే సామర్థ్యం ఉన్న వారికి భవిష్యత్‌లో అవకాశాలకు కొరత ఉండదు. కృత్రిమ మేధ యుగం మనిషి పాత్రను తగ్గించే కాలం కాదు; కొత్తగా నిర్వచించే కాలం. మార్పును అంగీకరించి, కొత్త నైపుణ్యాలను అలవర్చుకుని, సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించినవారే రేపటి ప్రపంచంలో ముందంజలో ఉంటారు.

యంత్రాల వేగాన్ని మానవ విలువలతో సమతుల్యం చేయగలిగితేనే అభివృద్ధి అందరికీ ప్రయోజనం చేకూరుస్తుంది. భవిష్యత్‌పై భయపడటానికి బదులుగా, భవిష్యత్‌కు సిద్ధమవడమే నేటి సమాజం ముందు ఉన్న అత్యంత ముఖ్యమైన బాధ్యత.



## కలుపు మందుల దుర్వినియోగంపై
# కట్టడి అత్యవసరం

(సి.హెచ్.ప్రతాప్)



వ్యవసాయంలో కలుపు మొక్కలను నియంత్రించేందుకు రూపొందించిన కలుపు మందులు నేడు మరో ప్రమాదకర రూపాన్ని సంతరించుకుంటున్నాయి. పంటల సంరక్షణకు ఉపయోగపడాల్సిన ఈ రసాయనాలను కొందరు మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నారన్న వార్తలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. శాస్త్రీయ పరిశోధనల ఫలితంగా రైతుల శ్రమను తగ్గించేందుకు అభివృద్ధి చేసిన ఉత్పత్తులు, సమాజంలోని బలహీన వర్గాల చేతుల్లో ప్రమాదకర సాధనాలుగా మారడం ఆలోచించాల్సిన విషయం. ఇది వ్యవసాయానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు; ప్రజారోగ్యం, యువత భవిష్యత్తు, సామాజిక భద్రతతో ముడిపడిన అంశం. ప్రపంచవ్యాప్తంగా మత్తు పదార్థాల స్వరూపం మారుతోంది. సంప్రదాయ మాదకద్రవ్యాలతో పాటు సులభంగా లభించే రసాయన పదార్థాలను ప్రత్యామ్నాయంగా వినియోగించే ధోరణి పెరుగుతోంది. ఇదే పరిస్థితి మన దేశంలోనూ కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయ అవసరాల కోసం మార్కెట్లో లభించే కొన్ని రసాయన ఉత్పత్తులను దుర్వినియోగం చేయడం వల్ల తాత్కాలిక మత్తు కలిగినా, దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థ, గుండె, కాలేయం, మూత్రపిండాలు వంటి కీలక అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా యుక్తవయసులో ఇటువంటి అలవాట్లు వ్యక్తిత్వ వికాసాన్ని, విద్యను, ఉపాధి అవకాశాలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. ఇంకో ఆందోళనకర అంశం ఏమిటంటే, వ్యవసాయంలో సాధారణంగా వినియోగించే కలుపు మందులు కొన్నిసార్లు రైతుల ఆత్మహత్యల్లో కూడా ఉపయోగించబడుతున్నాయి. ఆర్థిక ఇబ్బందులు, పంటల నష్టాలు, అప్పుల భారం, వ్యక్తిగత సమస్యలు వంటి అనేక కారణాల వల్ల తీవ్రమైన నిరాశకు గురయ్యే కొందరు రైతులకు ఇటువంటి రసాయనాలు సులభంగా అందుబాటులో ఉండటం విషాదకర పరిణామాలకు దారితీస్తోంది. ఈ పరిస్థితి వ్యవసాయ రసాయనాల విక్రయం, నిల్వ, వినియోగంపై మరింత బాధ్యతాయుతమైన విధానాల అవసరాన్ని గుర్తు చేస్తోంది. అదే సమయంలో రైతులకు సకాలంలో ఆర్థిక భరోసా, మానసిక ఆరోగ్య సహాయం, కౌన్సెలింగ్ సేవలు, సంక్షోభ సమయంలో తక్షణ సహాయక వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం కూడా స్పష్టమవుతోంది.

ఈ సమస్యను కేవలం చట్ట అమలు కోణంలో చూడటం సరిపోదు. వ్యవసాయ రసాయనాల విక్రయ వ్యవస్థలో మరింత పారదర్శకత అవసరం. లైసెన్సు పొందిన దుకాణాల ద్వారానే విక్రయాలు జరిగేలా కఠినంగా అమలు చేయడంతో పాటు, కొనుగోలుదారుల వివరాలు, అవసరమైన పంట, వినియోగ పరిమాణం వంటి సమాచారం నమోదు చేసే విధానాన్ని డిజిటల్ రూపంలో అమలు చేయాలి. అనుమానాస్పద కొనుగోళ్లను గుర్తించే పర్యవేక్షణ వ్యవస్థను రూపొందిస్తే దుర్వినియోగాన్ని ప్రారంభ దశలోనే అరికట్టే అవకాశం ఉంటుంది. తయారీ సంస్థలు కూడా ఉత్పత్తులపై స్పష్టమైన హెచ్చరికలు, భద్రతా సూచనలు, దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాల వివరాలను ప్రముఖంగా ముద్రించాలి. అయితే చట్టాల కంటే బలమైన నియంత్రణ సమాజం నుంచే రావాలి. పిల్లల్లో ప్రవర్తనా మార్పులను తల్లిదండ్రులు గమనించాలి. పాఠశాలలు, కళాశాలలు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, ఒంటరితనం, చెడు స్నేహాలు వంటి కారణాలను గుర్తించి సకాలంలో కౌన్సెలింగ్ అందించాలి. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ, విద్యాసంస్థలు కలిసి సమన్వయంతో పనిచేస్తేనే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కోగలుగుతాం.

వ్యవసాయ రసాయనాలు రైతు చేతిలో పంటలను రక్షించే సాధనాలు; అవి యువత జీవితాలను నాశనం చేసే మత్తు సాధనాలుగా మారకూడదు. శాస్త్ర విజ్ఞానం సమాజ శ్రేయస్సు కోసం పుట్టింది, సమాజానికే ముప్పుగా మారేందుకు కాదు. అందుకే బాధ్యతాయుతమైన విక్రయ విధానం, అప్రమత్తమైన పర్యవేక్షణ, నిరంతర ప్రజా చైతన్యం, యువతలో జీవన విలువల పెంపు—ఈ నాలుగు స్తంభాలపై నిలిచిన సమగ్ర కార్యాచరణే ఈ కొత్త సవాలుకు శాశ్వత పరిష్కారాన్ని చూపగలదు.

# రక్తదానంపై అపోహలకు చెక్



ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, రక్త సంబంధిత వ్యాధులు వంటి అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ, మనిషి రక్తానికి ప్రత్యామ్నాయాన్ని ఇప్పటి వరకు కనుగొనలేకపోయింది. అందువల్ల స్వచ్ఛంద రక్తదానం ద్వారానే వేలాది మంది ప్రాణాలు నిలబడుతున్నాయి. అయినప్పటికీ రక్తదానంపై ఇప్పటికీ అనేక అపోహలు ప్రజల్లో ఉన్నాయి. ఈ అపోహల కారణంగా చాలామంది రక్తదానం చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. వాస్తవానికి శాస్త్రీయంగా నిరూపితమైన నిజాలను తెలుసుకుంటే రక్తదానం ఎంత సురక్షితమో అర్థమవుతుంది. రక్తదానం చేస్తే శరీరంలో రక్తం శాశ్వతంగా తగ్గిపోతుందని చాలామంది భావిస్తారు. ఇది పూర్తిగా అపోహ మాత్రమే. ఆరోగ్యవంతుడైన వ్యక్తి నుంచి తీసుకునే రక్త పరిమాణం శరీరానికి ఎలాంటి హాని కలిగించదు. శరీరం కొద్ది గంటల్లోనే రక్తంలోని ద్రవ భాగాన్ని పునరుద్ధరిస్తుంది. కొన్ని వారాల్లో ఎర్ర రక్తకణాలు కూడా తిరిగి తయారవుతాయి. అందుకే నిర్దిష్ట వ్యవధి తర్వాత మాత్రమే మళ్లీ రక్తదానం చేయాలని వైద్యులు సూచిస్తారు.

రక్తదానం చేస్తే బలహీనత వస్తుందని కూడా చాలామంది భయపడుతుంటారు. నిజానికి రక్తదానం చేసే ముందు దాత ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా పరీక్షిస్తారు. హిమోగ్లోబిన్ స్థాయి, రక్తపోటు, బరువు వంటి అంశాలు పరిశీలించిన తర్వాతే రక్తాన్ని సేకరిస్తారు. రక్తదానం అనంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని తగినంత నీరు, తేలికపాటి ఆహారం తీసుకుంటే సాధారణ పనులు చేసుకోవచ్చు. దీర్ఘకాలిక బలహీనత వచ్చే అవకాశం లేదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రక్తదానం చేస్తే అంటువ్యాధులు సోకుతాయని కూడా ఒక అపోహ ఉంది. కానీ రక్త సేకరణలో పూర్తిగా కొత్తగా తయారు చేసిన, ఒకసారి మాత్రమే ఉపయోగించే క్రిమిరహిత పరికరాలను ఉపయోగిస్తారు. ఒక వ్యక్తికి ఉపయోగించిన సూది లేదా పరికరాన్ని మరొకరికి ఎప్పుడూ ఉపయోగించరు. అందువల్ల రక్తదానం ద్వారా అంటువ్యాధులు సోకే అవకాశం ఉండదని వైద్యులు చెబుతున్నారు.

మహిళలు రక్తదానం చేయకూడదనే అభిప్రాయం కూడా చాలామందిలో కనిపిస్తుంది. వాస్తవానికి ఆరోగ్యంగా ఉండి అవసరమైన హిమోగ్లోబిన్ స్థాయి ఉన్న మహిళలు కూడా రక్తదానం చేయవచ్చు. అయితే గర్భిణులు, ప్రసవం జరిగిన వెంటనే ఉన్న మహిళలు లేదా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సూచన మేరకే రక్తదానం చేయాలి. పురుషులు, మహిళలు ఇద్దరూ సమానంగా రక్తదానంలో పాల్గొనడం సమాజానికి ఎంతో మేలు చేస్తుంది. మధుమేహం లేదా రక్తపోటు ఉన్నవారు ఎప్పుడూ రక్తదానం చేయలేరని అనుకోవడం కూడా సరికాదు. వ్యాధి నియంత్రణలో ఉండి, వారు తీసుకుంటున్న మందులు, ఆరోగ్య పరిస్థితి రక్తదానానికి అనుకూలంగా ఉంటే వైద్యుల అనుమతితో రక్తదానం చేయవచ్చు. ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి రక్తదానానికి అర్హతను నిర్ణయిస్తారు. అందుకే స్వయంగా నిర్ణయం తీసుకోవడం కంటే రక్త బ్యాంకు వైద్యుల సలహా తీసుకోవడం ఉత్తమం.

ఒకసారి రక్తదానం చేసిన తర్వాత తరచూ చేయాల్సి వస్తుందని కొందరు భావిస్తారు. దీనికీ ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేదు. రక్తదానం పూర్తిగా స్వచ్ఛంద సేవ. ఎవరైనా తమ ఇష్టానుసారం, నిర్దేశిత వ్యవధి పాటిస్తూ మాత్రమే రక్తదానం చేయవచ్చు. ఒకసారి రక్తదానం చేశారని మళ్లీ తప్పనిసరిగా చేయాలనే నిబంధన ఎక్కడా లేదు. రక్తదానం వల్ల దాత ఆరోగ్యానికీ కొన్ని ప్రయోజనాలు ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకునే అవకాశం లభించడం, సమాజానికి ఉపయోగపడుతున్నామనే మానసిక సంతృప్తి కలగడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి. అయితే రక్తదానం ఆరోగ్యాన్ని మెరుగుపరచే చికిత్స కాదని, అర్హత ఉన్నవారు మాత్రమే చేయాలని వైద్యులు చెబుతున్నారు.

మన దేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది యూనిట్ల రక్తం అవసరమవుతోంది. ప్రమాదాలు, క్యాన్సర్ చికిత్సలు, తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులు, ప్రసవ సమయంలో అత్యవసర పరిస్థితులు ఎదుర్కొనే మహిళలకు రక్తం ప్రాణాధారంగా మారుతుంది. ఒక వ్యక్తి ఇచ్చే ఒక్క యూనిట్ రక్తాన్ని వివిధ భాగాలుగా విడదీసి ముగ్గురు వరకు రోగులకు ఉపయోగించే అవకాశం ఉంది. అందువల్ల ప్రతి రక్తదానం అనేక కుటుంబాల్లో ఆశను నింపగలదు. రక్తదానంపై ఉన్న అపోహలను పక్కనబెట్టి శాస్త్రీయ నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యవంతులైన యువత, ఉద్యోగులు, విద్యార్థులు, సామాజిక సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వస్తే రక్త కొరత సమస్యను గణనీయంగా తగ్గించవచ్చు. "రక్తదానం - మహాదానం" అనే సందేశం కేవలం నినాదంగా కాకుండా ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైతే అవసరమైన సమయంలో ఎవరికీ రక్తం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# యువత సమస్యలపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఉత్తమ్

**హైదరాబాద్, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువత ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని తెలంగాణ నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. నిరుద్యోగం, పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులు, విద్యార్థుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి కారణంగా యువతలో తీవ్ర అసంతృప్తి పెరిగిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వానికి యువతతో దూరం పెరుగుతోందని అన్నారు. యువత, విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేపడితే వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ప్రశ్నించే స్వరాలను అరెస్టులు, బెదిరింపులతో అణచివేయాలని చూడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు.
ఇలాంటి పరిస్థితుల్లో భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ యువతకు అండగా నిలుస్తూ వారి సమస్యలపై నిరంతరం గళమెత్తుతున్నారని మంత్రి పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన రాజీలేని పోరాటం చేస్తున్నారని, యువత ఆశయాలకు ప్రతినిధిగా నిలుస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ రాజకీయాలు ప్రేమ, న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువలపై ఆధారపడి ఉన్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందువల్ల దేశ యువత, మేధావులు, మధ్యతరగతి ప్రజల్లో ఆయనపై విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. దేశానికి ప్రత్యామ్నాయ నాయకత్వంగా రాహుల్ గాంధీ ఎదుగుతున్నారని అభిప్రాయపడ్డారు.
తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, యువత ఉపాధి, సామాజిక న్యాయానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దేశ యువత భయపడకుండా తమ హక్కులు, భవిష్యత్తు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు సాగాలని ఉత్తమ్ కుమార్



రెడ్డి పిలుపునిచ్చారు. యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, దేశంలో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే దిశగా పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# సింగరేణిలో జియో సైన్స్ లేబరేటరీ ప్రారంభం

- **అత్యాధునిక పరిశోధనలకు నూతన వేదిక**
- **ఖనిజాల విశ్లేషణకు ఆధునిక సాంకేతికత**
- **బొగ్గు నాణ్యత నిర్ధారణలో మరింత కచ్చితత్వం**
- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి సంస్థలో భూగర్భ శాస్త్ర పరిశోధనలు, ఖనిజాల విశ్లేషణను మరింత ఆధునీకరించే లక్ష్యంతో కొత్తగూడెం కార్పొరేట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక జియో సైన్స్ లేబరేటరీని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. జిల్లా పర్యటనలో భాగంగా కొత్తగూడెంకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ అంకిత్ పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం లేబరేటరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ప్రారంభోత్సవం అనంతరం ఉప ముఖ్యమంత్రి లేబరేటరీలో ఏర్పాటు చేసిన అత్యాధునిక యంత్ర పరికరాలను పరిశీలించారు. ఖనిజాల విశ్లేషణ, బొగ్గు నాణ్యత నిర్ధారణ, భూగర్భ శాస్త్ర పరిశోధనలకు వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సింగరేణి అధికారులు వివరించారు. లేబరేటరీలో అందుబాటులో ఉన్న పరీక్షా విధానాలు, విశ్లేషణ సామర్థ్యం, పరిశోధనల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ జియో సైన్స్ లేబరేటరీ ద్వారా ఖనిజాల నమూనాల విశ్లేషణ, బొగ్గు నాణ్యత నిర్ధారణ, భూగర్భ శాస్త్ర పరిశోధనలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతంగా, కచ్చితత్వంతో నిర్వహించే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. దీనివల్ల సింగరేణిలో శాస్త్రీయ పరిశోధనలకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు గనుల నిర్వహణలో సాంకేతిక సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.
ఖనిజ సంపద వినియోగంలో శాస్త్రీయ విధానాలు, ఆధునిక సాంకేతికత కీలకమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పరిశోధనల ద్వారా లభించే సమాచారం గనుల ప్రణాళిక, నాణ్యత నియంత్రణ, ఉత్పాదకత పెంపుకు దోహదపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ సింగరేణిని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యుడు రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్ గౌతమ్ పొట్రూ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సింగరేణి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కొత్త లేబరేటరీ సింగరేణిలో పరిశోధనలకు, ఖనిజాల విశ్లేషణకు, ఆధునిక గనుల నిర్వహణకు కీలక కేంద్రంగా నిలవనుందని అధికారులు తెలిపారు.

# ఆర్మీ భూమి రక్షణకు హైడ్రాను ఆశ్రయించిన అధికారులు

- **ఆక్రమణలపై వినతిపత్రం సమర్పణ**
- **అనుమతుల్లేని నిర్మాణాలపై ఫిర్యాదు**
- **క్షేత్రస్థాయిలో విచారణకు ఆదేశాలు**



**హైదరాబాద్, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):** ఆర్మీకి చెందిన భూమిపై జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్న ఆక్రమణలను అడ్డుకుని ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతూ రక్షణ శాఖ అధికారులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను గురువారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ జై సింగ్ భూమి ఆక్రమణకు సంబంధించిన వివరాలను కమిషనర్‌కు వివరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని జీఎల్ఆర్ సర్వే నంబర్ 507లో ఆర్మీకి చెందిన ఏ-1 భూమి ఉందని, ఆ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్మీ భూమిని ఆక్రమించి అనుమతులు లేకుండానే జీ ప్లస్-2 భవన నిర్మాణం చేపట్టినట్లు ఆరోపించారు.
అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రక్షణ శాఖ అధికారులు హైడ్రాను కోరారు. రక్షణ శాఖకు చెందిన భూములపై ఎలాంటి ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంబంధిత అధికారులకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
భూమి యాజమాన్యం, నిర్మాణ అనుమతులు, ఇతర సంబంధిత రికార్డులను పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని హైడ్రా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, రక్షణ శాఖ భూముల పరిరక్షణ విషయంలో రాజీ పడబోమని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్‌తో జరిగిన సమావేశంలో హైడ్రా సహాయ పోలీసు కమిషనర్ ఉమామహేశ్వరరావు కూడా పాల్గొన్నారు. ఫిర్యాదుపై త్వరితగతిన విచారణ పూర్తి చేసి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.





# అమెరికాలో తెలంగాణ అభివృద్ధిపై చర్చ

- **డల్లాస్‌లో ఎన్నారై నాయకులతో భేటీ**
- **తెలంగాణకు విదేశాల నుంచి మద్దతుపై హర్షం**
- **ప్రవాసుల సేవలు స్ఫూర్తిదాయకమన్న సీతక్క**

**డల్లాస్ (టెక్సాస్), జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ నగరంలో తెలంగాణ కాంగ్రెస్, భారత జాతీయ కాంగ్రెస్ విదేశీ విభాగం నాయకత్వంతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్ విదేశీ విభాగం అమెరికా సభ్యుడు అచ్యుత్ తుమ్మల నివాసంలో నిర్వహించిన ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి, ప్రవాస భారతీయుల పాత్ర, ప్రజా సంక్షేమ అంశాలపై చర్చించారు.
ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి విదేశాల్లో నివసిస్తున్న ప్రవాస భారతీయులు అందిస్తున్న సహకారాన్ని మంత్రి సీతక్క అభినందించారు. మాతృభూమి పట్ల వారు చూపుతున్న ఆప్యాయత, సేవా భావం ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో వారి భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. డల్లాస్ తెలంగాణ కాంగ్రెస్, భారత జాతీయ కాంగ్రెస్ విదేశీ విభాగం నాయకులు అందించిన ఆతిథ్యానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. విదేశాల్లో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతున్న వారి సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి ప్రవాస భారతీయుల సూచనలు, సహకారం ఎంతో విలువైనవని మంత్రి పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక అభివృద్ధి వంటి రంగాల్లో ప్రవాసుల భాగస్వామ్యంతో మరిన్ని అవకాశాలు సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు.
సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. తెలంగాణను అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రవాస భారతీయులు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు రాష్ట్ర పురోగతికి నిరంతరం అండగా నిలుస్తుండటం గర్వకారణమని మంత్రి సీతక్క అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ వాసుల సహకారంతో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందనే విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు.



# శాసనసభ భవనానికి సరికొత్త మెరుగులు

- **పునరుద్ధరణ పనులు పరిశీలించిన ముఖ్యమంత్రి**
- **పనుల పురోగతిపై అధికారులకు కీలక సూచనలు**
- **చారిత్రక వారసత్వ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి**

**హైదరాబాద్, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):** చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెలంగాణ శాసనసభ భవనంలో కొనసాగుతున్న మరమ్మతు, పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. శాసనసభ ప్రాంగణమంతా తిరిగి పనుల పురోగతిని పరిశీలించిన ముఖ్యమంత్రి, సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుని పలు కీలక సూచనలు చేశారు. శాసనసభ భవనం చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్న ముఖ్యమంత్రి, మరమ్మతు పనులు అత్యున్నత ప్రమాణాలతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భవనం అసలు నిర్మాణ శైలికి ఎలాంటి భంగం కలగకుండా పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పనిలో నాణ్యతతో పాటు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.
శాసనసభ ప్రాంగణంలోని వివిధ విభాగాలను పరిశీలించిన ముఖ్యమంత్రి, చేపడుతున్న పనులు నిర్ణీత గడువులోగా పూర్తి అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపర్చాలని ఆదేశించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచిన శాసనసభ భవనాన్ని భావితరాలకు వారసత్వంగా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడుతూ ఆధునిక సౌకర్యాలను కల్పించేలా పనులు కొనసాగించాలని సూచించారు.
శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, జైవీర్ రెడ్డి ముఖ్యమంత్రితో కలిసి పునరుద్ధరణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై వారు కూడా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు పాల్గొని మరమ్మతు, పునరుద్ధరణ పనుల ప్రస్తుత స్థితి, తదుపరి కార్యాచరణపై ముఖ్యమంత్రికి వివరించారు. పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేసి తెలంగాణ శాసనసభ భవన వైభవాన్ని మరింత పెంపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.



## క్యాన్సర్ నియంత్రణకు ముందస్తు పరీక్షలే కీలకం

- **స్టార్ ఆసుపత్రిలో ప్రత్యేక సేవల ప్రారంభం**
- **రోగి జీవన నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి**
- **నివారణపై ప్రజల్లో అవగాహన పెరగాలి**

**హైదరాబాద్, జూలై 23 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న స్టార్ ఆసుపత్రిలో క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక నొప్పి నివారణ, ఉపశమన వైద్య సేవలను మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు గురువారం ప్రారంభించారు. క్యాన్సర్ బాధితులకు సమగ్ర, రోగి కేంద్రిత వైద్య సేవలు అందించే దిశగా ఆసుపత్రి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. క్యాన్సర్ చికిత్స అనేది కేవలం వ్యాధిని నయం చేయడానికే పరిమితం కాకుండా, రోగుల బాధలను తగ్గించడం, వారికి గౌరవప్రదమైన జీవితం, మెరుగైన జీవన నాణ్యత కల్పించడంపైనా దృష్టి సారించాలని వెంకయ్య నాయుడు అన్నారు. రోగిని కేంద్రబిందువుగా చేసుకుని వైద్య సేవలు అందించడం వైద్య రంగంలో గొప్ప మార్పునకు నాంది పలుకుతుందని పేర్కొన్నారు.
ఆధునిక క్యాన్సర్ చికిత్సలో నొప్పి నివారణ, ఉపశమన వైద్య సేవలు ఎంతో కీలకమని ఆయన చెప్పారు. ఇవి చివరి దశ రోగులకు మాత్రమే కాకుండా, చికిత్స ప్రారంభమైనప్పటి నుంచే అందుబాటులో ఉండాలని సూచించారు. క్యాన్సర్ నిపుణులు, ఉపశమన వైద్య నిపుణులు సమన్వయంతో పనిచేస్తే రోగులకు మరింత మెరుగైన ఫలితాలు లభిస్తాయని తెలిపారు. క్యాన్సర్‌కు జన్యుపరమైన కారణాలతో పాటు పర్యావరణ కాలుష్యం, ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత లోపం, ఆధునిక జీవనశైలి వంటి అనేక అంశాలు కారణమవుతున్నాయని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. అందువల్ల క్యాన్సర్ నివారణకు దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.
క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, ముఖ్యంగా ప్రమాద అవకాశాలు ఎక్కువగా ఉన్నవారు ముందస్తు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని ఆయన సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు పెరుగుతాయని, ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. క్యాన్సర్‌పై సమర్థవంతమైన పోరాటానికి ఆధునిక వైద్యం, ముందస్తు నిర్ధారణ, ప్రజల్లో అవగాహన, ఉపశమన వైద్య సేవలు సమన్వయంతో సాగాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు వైద్య సంస్థలు మరింత కృషి చేయాలని సూచించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in